కథ

# ప్రేమలే(ఖ)క ... కాదు!

-'మధూహ'

**ఆవలించని** మనిషి, ఆలోచించని మనసు ఎప్పుడైనా కన్నారా; విన్నారా! పనివత్తిడివల్ల ఆవలిస్తూ, ఆలోచనలో పడుతూ కారులో ఆఫీసు నుండి యింటికి చేరుకున్నాను. డ్రైవర్‌ని కారు పార్కుచేసి యింటికి వెళ్ళి ఉదయాన్నే ఆరుగంటలకల్లా రమ్మని చెప్పాను. పైకి వెళ్ళేసరికి పిల్లలు ఎవరి గదులలో వాళ్ళు చదువుకుంటూ కనిపించారు. వాళ్ళలో చిన్నటి చిరునవ్వు... నన్ను చూడగానే. బదులుగా నా పెదవుల వెంట మందహాసం.

యిద్దరమూ కొంచెం పెద్ద వుద్యోగాలు వెలగబెడుతున్నామనేమో, ధనవంతులు అని చెప్పటానికి ఒక మెట్టు క్రిందగా, మంచి కాలనీలో, మేము అనుకున్న బడ్జెట్ కంటే ఒక మెట్టు ఎక్కువలో మూడు బెడ్ రూముల ఫ్లాట్ ఒకటి కొనుక్కొని యీ మహానగరంలో స్థిరపడి పదేళ్ళు దాటుతోంది.

మా యిద్దరివీ వేరేవేరే ఆఫీసులు, వేరువేరు దారులలో. యిద్దరికీ కంపెనీలు కార్లని సమకూర్చాయి. వున్నంతలో పిల్లలని పేరున్న స్కూలులోవేసి, ప్రయాణపు బాధ్యత స్కూల్ బస్ మీద వదలివేసాము. పిల్లలు కూడా మా బిజీ లైఫ్‌లకి అలవాటుపడిపోయారు.

వారాంతంలో మాత్రం పిల్లలని తప్పనిసరిగా బయటకు తీసుకెళ్ళి, వారికి నచ్చిన విధంగా గడపటానికి ప్రయత్నిస్తాము. వారు కూడా మా బిజీని అర్థం చేసుకునే వయసుకి చేరుకున్నారు. కాబట్టి, ఒక్కింత హాయి అనిపిస్తుంది. కానీ, అది కుదరనప్పుడు బాధగా వున్నా, వారికి నచ్చచెప్పటానికి ప్రయత్నించి, సఫలమైనప్పుడు మనసు కుదుటపడి ప్రశాంతంగా ఉంటుంది.

ꕥ

వంటింట్లోకి వెళ్ళి కాఫీమిషన్ ఆన్‌చేసి, ఒక కప్పు వేడి కాఫీతో టి.వి. ముందు కూర్చున్నాను. న్యూస్ కూడా చూడ బుద్ధికాలేదు. ఏమంత గొప్ప సమాచారం లేదు కూడా! వుదయాన్నే ఢిల్లీకి ప్రయాణం.

> **తక్కువైనా, ఎక్కువైనా సర్దుకుపోవటం నేర్చుకోవాలనేది నా ఆలోచన/వాదన. ఆవాదన అవాక్కవుతుంది. ఆలోచించలేని స్థితిలో ఎప్పుడైనా! ఏం చేసినా తనకోసం నేను, నాకోసం తను. ఇది మాత్రం సర్దుకుపోవటం కాదా! అదే నా ఆలోచనకి మలుపుగా నావాదనకి గెలుపుగా భావించిన సందర్భాలు లేకపోలేదు.**

మా ఎం.డీ గురించి చెప్పాలంటే, అదోటైపు, ముందస్తుగా చెప్పకుండా ప్రయాణాలు, మీటింగులు ప్లాన్ చేయబడతాయి. ఏమన్నా అడిగితే 'ప్రయాణంలో లాప్‌టాప్‌లో మెటీరియల్ ప్రిపేర్ చెయ్యొచ్చు' అనటం ఆనవాయితీ అయిపోయింది.

బద్ధకంగా వుండటంతో టి.వి. కట్టేసి, వేన్నీళ్ళతో స్నానం చేసి, తనకోసం ఎదురు చూడకుండా నిద్రలోకి జారుకున్నాను. ఈ బిజీ వుద్యోగాలతో ఎవరి టైమింగ్స్ వారివి, సెల్‌ఫోన్‌లోనే అప్పుడప్పుడూ గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్‌లు కూడాను. తనకోసం మధ్యాహ్నం నుంచి ట్రై చేస్తున్నాను. లైన్ బిజీ, సో నో కాంటాక్టు. ఢిల్లీ ప్రోగ్రాం చెబుదామంటే కుదరనేలేదు. యిక తప్పక మెసేజ్ యిచ్చి వదిలేసాను. రిప్లై రాదని తెలుసు. కోపంలో వుంటే ఎలా వస్తుంది!!!

ꕥ

క్రిందటి శని, ఆదివారాలు యిలాగే అనుకోకుండా (ఎప్పటిలానే) మద్రాసుకి ప్రయాణం, మా ఎం.డితో. ఆ అలకే అయిదురోజులు కంటిన్యూ అయ్యింది. మళ్ళీ యింతలోనే ఢిల్లీకి. అలక మాట అటుంచితే తనకీ తప్పవు అప్పుడప్పుడు యిటువంటి ప్రయాణాలు. కానీ యింత తక్కువ వ్యవధిలో తక్కువే. ఏం చేస్తాం వృత్తి ధర్మం పాటించాలి కదా!

**వుదయం లేవగానే, తను యింటికి, పక్కమీదకి ఎప్పుడు చేరితే నాకెందుకు లెమ్మని (అలవాటేగా మరి), నిద్రలేపటం యిష్టంలేక 'బై బై' అని స్లిప్పురాసి బెడ్‌రూమ్ తలుపుకి లేవగానే కనిపించేటట్లు అతికించాను.**

తక్కువైనా, ఎక్కువైనా సర్దుకుపోవటం నేర్చుకోవాలనేది నా ఆలోచన/వాదన. ఆ వాదన అవాక్క వుతుంది ఆలోచించలేని స్థితిలో ఎప్పుడైనా! ఏం చేసినా తనకోసం నేను, నాకోసం తను. ఇది మాత్రం సర్దుకుపోవటం కాదా! అదే నా ఆలోచనకి మలుపుగా నావాదనకి గెలుపుగా భావించిన సందర్భాలు లేకపోలేదు.

వుదయం లేవగానే, తను యింటికి, పక్కమీదకి ఎప్పుడు చేరితే నాకెందుకు లెమ్మని (అలవాటేగా మరి), నిద్రలేపటం యిష్టంలేక 'బై బై' అని స్లిప్పురాసి బెడ్‌రూమ్ తలుపుకి లేవగానే కనిపించేటట్లు అతికించాను. ఎప్పుడూ రెండు, మూడు జతల బట్టలు సర్దివుంచిన బ్యాగ్ తీసుకుని, క్రిందికి వచ్చి, అప్పటికే వచ్చి వున్న డ్రైవర్‌తో స్టేషన్‌కి వెళ్ళమని చెప్పాను.

సమయం ఆరున్నర గంటలు. ఉదయం కావటంతో రోడ్లు చాలా వరకు ఖాళీగావున్నాయి. పేవ్‌మెంట్లు మాత్రం నడిచే వాళ్ళతో కొంచెం హడావుడి. అప్పటికే ఎం.డి నుంచి ఫోన్. 'నేను బయలుదేరాను అనుకున్నాక వూపిరి పీల్చుకుని, రిలాక్స్ అయ్యేరకం' కొంచెం కసిగానే మనసులో అను కున్నాను.

ꕥꕥꕥ

రైలు ఎక్కాక, కొంచెం ఫ్రెషప్ అయ్యి, పిచ్చి రైల్వే కాఫీ తాగక తప్పిందికాదు, ఎం.డికి కంపెనీ యివ్వాలిగా మరి. కొంచెం సేపు టైమ్స్ ఆఫ్ యిండియా పేపరు హెడ్‌లైన్స్ తిరగేసాను. వుద్యోగానికి తగ్గట్టుగా బిజినెస్ పేజ్ దగ్గర నా కళ్ళకి స్పీడ్ బ్రేకర్లు అడ్డువచ్చాయి. ఎం.డి వంక చూసాను. లాప్‌టాప్ మీద ఏదో పని చేసుకోవటం గమనించి, డిస్టర్బ్ చేయలేదు. నాకు నచ్చిన ఆర్టికల్స్ చదువుతున్నంతలో బ్రేక్‌ఫాస్ట్ వచ్చింది.

మా ఎం.డి పని దగ్గర ఎంత స్ట్రిక్ట్‌గా వున్నా, ఫుడ్ దగ్గర మాత్రం ఖచ్చితమైన ఫ్రీనెస్ చూపించటం నాకు నచ్చుతుంది. అన్నీ వీలైనంత వరకు అందుబాటులో వుండేటట్లు, యింటి నుంచి ప్యాక్ చేసైనాసరే, ఏర్పాట్లు చేయబడతాయి. టిఫిన్ తింటూ కొంచెంసేపు కంపెనీ గురించి, కాబోయే మీటింగ్ విషయాలతోటి కాలం గడిపాను. మధ్య మధ్యలో యింటి మీద ధ్యాసతో కదిలే మనసుని పట్టి ఆపలేకున్నాను. లాప్‌టాప్‌లో మీటింగ్ ప్రెజెంటేషన్ గురించి వివరాలు రాసుకుంటూ, చదువుకుంటున్నాను; నడుమ ఆవలింతలతో...

ꕥꕥꕥ

కాసేపు కునుకు తీద్దామని నడుము వాల్చాను. నిద్రలోకి జారుకుంటే అది వేరే మాట. కానీ ఎందుకో ధ్యాస యింటిమీదకి మళ్ళింది. సెల్‌ఫోన్‌లో సిగ్నల్స్ చక్కగా కనిపిస్తున్నా, కాల్ చెయ్యబుద్ధికాలేదు. కొద్ది సేపు ఆగితే తనే ఫోన్ చేయక తప్పదు, నేను బిజీగా వుంటానని వూహించకపోయినా, సిగ్నల్స్ ప్రాబ్లెమ్ యిస్తాయని తెలుసు.

అప్పుడు అనిపించింది నాకు 'ఎప్పుడూ ఈ-మెయిల్స్ యిచ్చుకోవటం, ఎస్.ఎమ్.ఎస్‌లో కులాసాలు కనుక్కోవటం, కాస్త సమయం దొరికితే ఫోన్లో కబుర్లు చెప్పుకోవటం పరిపాటే. కానీ పేపర్‌మీద స్వదస్తూరితో వుత్తరం రాసుకుంటే ఎలా వుంటుంది అని! ఇంతవరకూ మేమిద్దరం ఒక్కసారి కూడా అలా రాసుకోలేదు. ఖచ్చితంగా చెప్పగలను. వెంటనే వైట్ పేపర్, పాడ్, పెన్ను అందుకుని రాయటం మొదలుపెట్టాలని ఆలోచనలలో మునిగాను. 'అవును ఎలా మొదలుపెట్టాలి, ఏమి రాయాలి, ఎంత రాయగలనో'..... నాలో నేనే చిన్నగా నవ్వుకొని నెత్తిమీద చేతితో ఠపీమని ఒక్కటిచ్చుకున్నాను... రాయటం మొదలు పెడుతూ....

ꕥꕥꕥ

"హాయ్! (ఎప్పుడూ ఒకే రకమైన పిలుపు; రాయకూడదు అనుకునేంతలో అక్షరాలు పడిపోయాయి. నో కొట్టివేతలు, ప్లీజ్! నా జీవితంలో నన్నునన్నుగా, నీలో నన్నుగా నా చిన్నిపాటి లేఖను అందజేస్తున్నందుకు ఎంతో ఆనందంగా వుంది. (ఎలావుంది చిరుపాటి ప్రాస). ఆశ్చర్యపోకు. ఇది రాస్తున్నది నేనే. ఈ లేఖ రాయాలనిపించే చిలిపి ఆలోచన నాకే నవ్వు తెప్పిస్తోంది.

**జీవితంలో చాలా వాటిని యిష్టపడగలం కానీ కొన్నింటిని మాత్రమే ప్రేమించగలం. (జడపదార్థాలు కాని వాటిని) ప్రేమించిన అన్నింటితో జీవించగలగడం అతిశయోక్తి మాత్రమే అవుతుంది.**

నువ్వు చదివే సమయానికి, నాకు తెలును తప్పకుండా నా ప్రక్కన వుండవు. ఎందుకంటే యిది నీ ఆఫీసుకి పంపిస్తున్నాను. బిజీగా వున్నా, కొద్దిపాటి సమయం నా వుత్తరం కోసం కేటాయిస్తావని ఆశిస్తున్నాను. యిది అందేలోపు మనం కాల్స్ చేసుకోవచ్చు. మెయిల్స్ యిచ్చుకోవచ్చు. కానీ దీని విషయం నీకు చెప్పకూడదన్న నా వుత్సాహాన్ని నీరుగార్చకు సుమా! (సరదాగా తీసుకో-నో సీరియస్).

అప్పుడెప్పుడో కాలేజీలో చదువుకునే రోజులలో ప్రేమలేఖల పోటీలో పాల్గొనడం కోసం, ప్రేమలేని, రాని రాసిన నాలేఖకు రెండవ బహుమతి వచ్చింది. మన పెళ్లైన క్రొత్తలో నా డైరీలో నుంచి పడిన ఆ లేఖ చూసి నువ్వుచూపిన అలక నాకిప్పటికీ నవ్వుతెప్పిస్తోంది (అదిగో గుర్తుచేస్తున్నందుకు మళ్ళీ అలకా!) నాకు మటుకు ఆ అలక మళ్ళీ నీ ప్రక్కనే వుండి ఈ వుత్తరం చదువుతున్నప్పుడు చూడాలనిపిస్తోంది. కానీ కుదరదు కదా! చిన్నిచిన్ని ఆశ....

దగ్గరగా వున్నంతసేపు దూరం కాకూడదనిపిస్తుంది. దూరంగా వున్నప్పుడు దగ్గరకి రావలనిపిస్తుంది. ఏమిటో పిచ్చి భావన, మనిషికే పుట్టించాలా ఆదేవుడు. నీకో సంగతి తెలుసా! ఈ ప్రపంచంలోనే అతివేగంగా పయనించేది ఏమిటో? "మనసు". ఎందుకంటే నేనీ వుత్తరం రాస్తున్నంత సేపూ అది నీ చెంతనే వుంటుంది. (అఫ్‌కోర్స్ మా ఎం.డి డిస్టర్బ్ చేయనంతవరకు) సెల్‌ఫోన్ సిగ్నల్స్ కంటే స్పీడ్‌గా అన్నమాట కాదు ఉన్నమాట. కానీ ఒక్క విషయం మాత్రం నిజం, మనసుని చదవటం, వినటం కొంచెం కష్టం. ఎస్.ఎం.ఎస్‌లు, వాయిస్‌మెయిల్స్ అంత ఈజీకాదు.

ఎందుకనో కాలేజీరోజులు గుర్తుకొస్తున్నాయి. 'మనసు మనం చెప్పిన మాట వినదు కదా!' అన్న వూహ కలిగిన రోజులు. అదే నువ్వు పరిచయం అయిన క్రొత్తలో అప్పట్లో నువ్వు అన్న మాటలు ఎలా మరువగలను.... ఇష్ట పడటం, ప్రేమించటం, జీవించటం, జీవితం నీతో పంచుకొన్న యిన్నేళ్ళ తరువాత ఈ మాటలు గుర్తుజేసుకోవటం కొంచెం హాస్యాస్పదంగా వుండచ్చేమోగానీ, నాకు మటుకు జీవిత సత్యాలు అనిపించటం నా మనోద్వేగానికి కొసమెరుపు లాంటిది. కొన్నిసార్లు అనిపిస్తుంది, మనం మన పిల్లలకి వీటిని వివరించగలమా, వాళ్ళు అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తారో లేక కొట్టిపారేస్తారో! నా మటుకు వివరించటం మన బాధ్యత అనే భావనని నువ్వు కొట్టి పారెయ్యవని నమ్మకం.

జీవితంలో చాలా వాటిని యిష్టపడగలం కానీ కొన్నింటిని మాత్రమే ప్రేమించగలం. (జడపదార్థాలు కాని వాటిని) ప్రేమించిన అన్నింటితో జీవించగలగడం అతిశయోక్తి మాత్రమే అవుతుంది. ఎంతో చక్కగా వివరించి చెప్పిన ఆ సమయంలో అనిపించలేదు నీతో జీవితం పంచుకుంటానని. జీవితం పంచుకున్న యిన్నేళ్ళు తరువాత జ్ఞాపకాలని వీడని ఈ మనసుతో నీకు చెప్పాలనిపిస్తోంది 'ఐ లవ్ యు రా!' (అదిగో మళ్ళీ నీ పెదవుల మీద దరహాసం చూడాలనిపిస్తోంది). ఎక్కడో పాట విన్నట్టు గుర్తు 'ప్రేమించటం ఒక ఆర్ట్ అంట. ప్రేమించబడటం గిఫ్ట్ అంట.' మనిద్దరిలో ఎవరికి ఎవరు ఆర్టో, ఎవరు ఎవరికి గిఫ్టో నిర్ణయించమని నీకే వదిలేస్తున్నాను.

కలునుకున్న సమయాలు తగ్గుతున్నాయి. పలకరించుకొనే పెదాలు దగ్గరవకున్నాయి. ఈ బిజీ లైఫ్‌లో కొన్నాళ్ళపాటు ఎక్కడికన్నా దూరంగా వెళ్ళి (పిల్లలని వదిలి కాదు) సమయాభావం తెలియకుండా గడపలేమా అనిపిస్తుంది. యిదేదో బాధగా చెప్పటంలేదు. భావంతో రాయాలనిపించి, నా భాషగా నీ ముందుంచుతున్నాను.

అదిగో మాబాస్ గురకలోంచి కొంచెంకొంచెంగా కదులుతూ లేస్తున్న సూచనలు. ముగించాలని లేకున్నా ఆగని నా మాటల వాక్యాలు ఏదో తెలియని రిలీవ్ ని

అందిస్తున్నాయి. మళ్ళీ వీలయితే నీ నుంచి రిప్లై కోసం ఎదురుచూడకుండా, యింకొకసారి రాయడానికి ప్రయత్నిస్తాను. ఎప్పుడో కాలేజీ లైఫ్‌లో రాసుకున్న డైరీలా మాత్రం కాదు... కొంచెం యిదో రకం ధోరణిలో హాయిని కోరుకుంటూ (ముచ్చటగా) మూడు వాక్యాలలో రాయలేని మూడు పేజీలు.

ఇదేదో ప్రేమలేఖల శరాలు అనుకునేవు. అంత మాత్రం చేత ప్రేమ లేక కాదు. నా, నీ కోసం రాసుకున్న జీవన సాగరాన ఎగిరిపడుతూ పుడమిని ముద్దాడుతున్న తరంగాల అక్షరాల మాల అనుకుంటే, నా అదృష్టానికి అంతే చాలు. కాలేజీలో రాసిన ప్రేమలేఖల పోటీలో వాడుకున్న, నా పేరుని చెప్పనీయని ఆ పేరుని, మళ్ళీ మన పేరుగా మలుచుకుంటూ, నీ పుట్టిన రోజుకి నా చిరుకానుకగా ఈ వుత్తరాన్ని అందిస్తున్న..... .... నీ 'మధూహ'.

✻✻✻

ఎం.డి. యింకా లేవలేదే అని చూస్తూ, కాసేపు ఏ.సిలోంచి బయటకు వచ్చి తలుపు దగ్గర నుంచున్నాను. ఈదురగాలి, పచ్చని చేలు యింతలో తన నుంచి ఫోను, ఎంతహాయి, యింకెంతో రిలీఫ్! కాసేపు అక్కడే నిలబడి నంతలో, మలుపు వచ్చిందేమో ఒంపు తిరిగిన రైలు బోగీలు, జీవనగమనానికి గుర్తింపుగా ప్రక్కన లోయలు లేకపోయినా హొయలు ఒలకబోస్తున్నాయి. బ్యాగ్‌లో దాచుకున్న వుత్తరాన్ని తలుచుకుంటూ చిరునవ్వుతో లోపలికి వచ్చి, ఎం.డి. లేవటంతో మళ్ళీ మొదలుపెట్టాను జీవితగమనంలో మరో చిరు ఘట్టాన్ని .....

✻✻✻ ✻✻✻

---

గీతం

# ఒక లావణ్యరూపం మధురభావన



పల్లవి: ఓ చెలియా ప్రియ చెలియా
నా మనవే విను సఖియా! !! 2 !!

అనుపల్లవి: చిగురాకుల చివురించిన
నా యెదలో ప్రియ భావన
అది ఒక మధుర భావన !! ఓ చెలియా!!

1.చరణం : వేణుగానమే నా రాగ ప్రేరణ
నా చెలి కోసమే నే నాలపించగా
నా హృదిలో ప్రతి భావన
నీ లావణ్య రూపమే -
నీ రూపమే అది అపురూపమే
నాలో ప్రేమ దీపం వెలిగించెలే
!! ఓచెలియా !!

2. చరణం: మేఘాల వెల్లువ నా పాట పల్లవి
అందాల పల్లకి అది పెళ్ళి పల్లకి
ఆ పల్లకిలో నీవే అపురూప రాశి
నా రాశివే నీవే ప్రణయ రాశివే
నా మది సామ్రాజ్యాన్ని గెలిచే
మహారాణివే - నీవే గృహరాణివే
నా హృదయ రాణివే !!ఓ చెలియా!!

-బి. కాంతారావు